క్లుప్తంగా

మహిళల ఇతిహాసాలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్రంలో పలు రంగాల్లో ప్రతిభను చాటుతూ పలువురికి స్ఫూర్తి దాయకంగా నిలిచిన 50 మంది మహిళలు వారి అనుభవాలు, ఫొటోలతో రూపొందించిన పుస్తకాన్ని మంగళవారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో పవన్ మోటార్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పవన్ మోటార్స్ డైరెక్టర్ కీర్తిరెడ్డి, పుస్తక రచయిత రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పుస్తక రచయిత రమేష్ మాట్లాడుతూ సమాజంలో పురుషులతో సమానంగా స్త్రీలు కూడా వారు ఎంచుకున్న రంగాల్లో ప్రతిభను కనబరుస్తూ ఉన్నత స్థానాల్లో నిలిచారన్నారు. వారి ఎదుగుదలకు తోడ్పాటు అందించివారు, ఎదుర్కొన్న సవాళ్లను ఇతివృత్తంగా తీసుకుని ఈ పుస్తకాన్ని రూపొందించామన్నారు. ఇలాంటి పుస్తకాలు రాబోయే తరానికి ఎంతో ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు రతీష్ కృష్ణన్, అర్పిత, సింగిరి కనుల, ముఖేష్ అమరణ్, భువనేశ్వరి, అన్‌ఖలణ్, రమ్య మురుగానందం తదితరులు పాల్గొన్నారు.

మహిపాల్‌రెడ్డికే మా మద్దతు

పటాన్‌చెరు: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఏకగ్రీవ తీర్మానం చేసింది. పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు హెయిర్ సెలూన్లకు ప్రతినెలా ఉచితంగా 250 యూనిట్లు విద్యుత్ అందిస్తోందన్నారు. దీంతో పాటు బీసీ బంధు పథకం ద్వారా అర్హులైన వారందరికీ స్వయంఉపాధి కోసం ఎలాంటి షరతులు లేకుండా రూ.లక్ష సాయం అందిస్తోందని వివరించారు. తనకు నాయీ బ్రాహ్మణ కుటుంబాలు ఏకగ్రీవంగా మద్దతు తెలపడంపై కృతజ్ఞతలు తెలిపారు. పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు శ్యామ్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వినోద్, నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, నారాయణ, చంద్రయ్య, నర్సింగరావు, వెంకటేష్, నిరంజన్, దినేష్ కుమార్, విష్ణు, పద్మనాభం, శివ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల్లో ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. రామచంద్రాపురం పట్టణంలోని అమర ల్యాబ్స్‌లో ఇటీవల యాజమాన్యం నిర్లక్ష్యంతో ప్రమాదం చోటుచేసుకోవడంతో చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా అధికారులు ఎందుకు తనిఖీలు చేయడంలేదని ప్రశ్నించారు. పరిశ్రమల యాజమాన్యాలు లాభాల మీద దృష్టి సారిస్తున్నారే తప్ప కార్మికుల భద్రతపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. రసాయన పదార్థాలకు తగిన వెంటిలేషన్ లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి పరిశ్రమలను తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, సత్తయ్య, నరసింహ, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

'రాజకీయ పార్టీలకు ప్రతిపాదనలు పంపాం'

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో వ్యాపార పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అన్ని రాజకీయ పార్టీలకు తమ సంస్థ తరఫున అవసరమైన ప్రతిపాదనలు పంపించామని అసోసియేటెడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (అస్సోచామ్) చైర్మన్ కటారు రవికుమార్‌రెడ్డి తెలిపారు. అసోచామ్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని నొవోటెల్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీ తమ ప్రతిపాదనలు పరిశీలిస్తుందని, ఆ మేరకు మేనిఫెస్టోలో వాటికి ప్రాధాన్యం ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ వ్యాపారవేత్త శ్రీధర్ పిన్నపురెడ్డిని తెలంగాణ రాష్ట్రాభివృద్ధి సమాఖ్య కో చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

యువత చూపు బీఆర్‌ఎస్ వైపు



ఎమ్మెల్యే గాంధీని సత్కరిస్తున్న నేతలు

- మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం
- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ధీమా

గచ్చిబౌలి: యువత బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని మస్తాన్‌నగర్‌కాలనీకి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, బీఆర్‌ఎస్ నేత సాయికుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత, అన్ని వర్గాలవారి సహకారంతో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధితో అన్ని వర్గాలవారు తమ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఇతర పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు కూడా బీఆర్‌ఎస్‌లో చేరడం శుభసూచకమన్నారు. శేరిలింగంపల్లిలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఖాళీ అయ్యాయన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీని కాలనీ,బస్తీ నుంచి డివిజన్, నియోజకవర్గ స్థాయిలో మరింత పటిష్టం చేయడానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గణేష్ ముదిరాజ్, చంద్రకాంత్, ప్రసాద్, రాజు, గురువయ్య, నగేష్, శ్రీనివాస్, వేణు, శ్రీనివాస్, గురు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న కార్పొరేటర్లు, నాయకులు, ఆలయకమిటీ ప్రతినిధులు

శేరిలింగంపల్లి: భెల్ ఎంఐజీకాలనీలో దసరా దేవీశరన్నవరాత్రి పూజల్లో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, కార్పొరేటర్లు సింధురెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌తోకలిసి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే, కార్పొరేటర్లను ఆలయ కమిటీ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి. భాస్కర్, రఘునాథ్‌రెడ్డి, భగవాన్, రాకేష్, నరేందర్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్ ఆస్పత్రిలో ట్రామా కేర్ సెంటర్ ప్రారంభం



ట్రామా సెంటర్‌ను ప్రారంభించిన డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఆస్పత్రి వైద్య బృందం

రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో నగరంలోనే అతి పెద్ద ట్రామా కేర్ సెంటర్‌ను మంగళవారం సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన సమయంలో అధునాతన వైద్య సేవలను అందించేందుకు ట్రామా సెంటర్ అవసరం ఎంతో ఉంటుందన్నారు. తక్షణ వైద్య సహాయం అవసరమయ్యే వ్యక్తులకు ఇది ఒక ముఖ్యమైన లైఫ్‌లైన్‌గా పని చేస్తుందన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో ట్రామా సెంటర్ ఎమర్జెన్సీ కేర్‌లో అత్యంత ప్రత్యేకమైన నైపుణ్యం, అనుభజ్ఞులైన వైద్య నిపుణుల బృందంతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి డాక్టర్లు మాట్లాడుతూ తక్షణ సహాయం అవసరమైన వ్యక్తులు వెంటనే ఈ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ల బృందం శశికాంత్, వేదప్రకాశ్, ప్రవీణ్‌మేరెడ్డి, భరత్‌కుమార్, ఆదిత్యచౌదరి, విశ్వక్‌సేనారెడ్డి, అనీల్ కుమార్, రాజేష్‌వాసు, విష్ణువర్ధన్‌రావిల్లా, జ్ఞానేశ్వర్‌అట్టూరు రాహుల్ కట్టా, నిఖిల్‌వంగపల్లి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సుమన్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని మహిళా దక్షత సమతి విద్యా సంస్థలు, సుమన్ బాలికల జూనియర్ కళాశాల, వీడీ బజాజ్ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామాకుమారి, సుశీల పాటిల్ ఆధ్వర్యంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు బతుకమ్మలను రంగు రంగుల పువ్వులతో తయారు చేశారు. బతుకమ్మలకు పప్పుధాన్యాల నైవేద్యాలతో, అటుకుల బెల్లంతో నైవేద్యాలు సమర్పించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ కోలాటాలు, నృత్యాలు చేశారు. సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

'గాయత్రీదేవి' గా అమ్మవారి దర్శనం



గాయత్రీ దేవిగా రాజరాజేశ్వరీ మాత



గచ్చిబౌలిలోని శివ సాయిక్షేత్రంలో..

రాయదుర్గం: దేవీశరన్నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తున్నారు. మంగళవారం గాయత్రీదేవీగా అలంకరించి చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గచ్చిబౌలిలోని జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి మాతకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. షిర్డీసాయిబాబా, చంద్రమౌళీశ్వరస్వామి, ఆంజనేయస్వామి, పెద్దమ్మ, ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించి చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలో మండపపూజ, చండీపారాయణం, చండీహోమం నిర్వహించారు. అనంతరం లలితాసహస్రనామపారాయణం, కుంకుమ పూజ నిర్వహించారు.

విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందించాలి

రాజేంద్రనగర్: విద్యుత్ వినియోగదారులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే సిబ్బంది స్పందించి పరిష్కరించాలని రాజేంద్రనగర్ డివిజనల్ ఇంజినీర్ పి.రత్నాకర్ రావు అన్నారు. మంగళవారం శివరాంపల్లిలోని డివిజన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో వినియోగదారులు ఫిర్యాదులకు స్పందించినప్పుడే మంచి పేరు రావడంతో పాటు సేవలు అందించిన వారవుతామన్నారు. సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది సేఫ్టీ పరికరాలను ధరించి పని చేయాలని సూచించారు. కొత్తగా విధుల్లో చేరిన జూనియర్ లైన్‌మెన్‌లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారులు తమ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే ప్రాంతాల వారీగా మొబైల్ నంబర్లు ఇచ్చామని ఆయా నంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలు సెక్షన్ అధికారులు, సిబ్బందికి వివరించాలన్నారు. ఈ కింద నంబర్లు ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్‌ఓసీ) కాల్ చేసి తమ సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారని డీఈ తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు సత్యనారాయణ, ఈశ్వర్ ప్రసాద్, శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్లు శ్రీనివాస్ రెడ్డి, హరినాథ చారి, జుబేరుద్దీన్, హథిరామ్, అఫ్సర్ భాష, శ్రీనివాస్, సురేశ్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ చేయాల్సిన నంబర్లు

1) గగన్‌పహడ్-9493193100
2) కాటేదాన్-9493193103
3) మైలార్‌దేవ్‌పల్లి-9493193102
4)రాజేంద్రనగర్-9493193105.
5)హిమాయత్‌నగర్-8688749801.
6) శివరాంపల్లి-9493193104
7) శంషాబాద్-9493193108

నేడు లలితాదేవి, రాజరాజేశ్వరీ మాత అలంకారంలో అమ్మవారి దర్శనం

రాయదుర్గం: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలోని అన్నపూర్ణాదేవి అమ్మవారిని రాజరాజేశ్వరిమాతగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. చండీపారాయణం, చండీహోమం నిర్వహించనున్నారు.

'మనూ'లో దూరవిద్యా కోర్సుల రిజిస్ట్రేషన్‌కు ప్రత్యేక పోర్టల్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని దూర విద్యా కోర్సుల్లో రిజిస్ట్రేషన్ కోసం పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ తెలిపారు. పోస్ట్‌గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఫాలో–అన్ కోర్సులలో రిజిస్ట్రేషన్ కోసం ఈ పోర్టల్‌ను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఫీజు చెల్లింపు, పోర్టల్ రిజిస్ట్రేషన్ కోసం అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 5 వరకు ఈ పోర్టల్ అందుబాటులో ఉంటుందన్నారు. 2018 నుంచి వార్షిక, సెమిస్టర్ మోడ్‌ల విద్యార్థులు ఈ సదుపాయాన్ని పొందవచ్చన్నారు. వివిధ కోర్సుల ఫీజు, ఇతర వివరాలన్నీ యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆయన వివరించారు.

22న శాంతిసరోవర్‌లో నవరాత్రి-2023 వేడుకలు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో నవరాత్రి-2023 వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రహ్మకుమారీస్ సంస్థ అదనపు పరిపాలనాధికారి రాజయోగిని మోహిని దీదీ, బ్రహ్మకుమారీస్ సంస్థ హైదరాబాద్ సబ్‌జోన్ ఇన్‌చార్జి రాజయోగిని కుల్‌దీప్‌దీదీ పాల్గొంటారు. ఈ సందర్భంగా దేవీ దర్శనం ,. ప్రత్యేక ప్రదర్శనలు, మెడిటేషన్ కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, దాండియా, గర్బారాస్, బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. వివరాలకై ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

మూడో సారి గెలిపిస్తాం..



ఎమ్మెల్యే గాంధీకి మద్దతు తెలుపుతున్న ప్రకాష్‌నగర్ కాలనీ వాసులు

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి ప్రకాష్‌నగర్ కాలనీ వాసుల మద్దతు

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని ముచ్చటగా మూడో సారి భారీ మెజార్టీతో గెలిపిస్తామని హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్ కాలనీ వాసులు అన్నారు. మంగళవారం వారు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి భారీ మెజార్టీతో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని గెలిపించుకుంటామన్నారు. ముఖ్యమంత్రి పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తాయన్నారు. ప్రజలందరికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించానని తనపై చూపిన అభిమానాన్ని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని రూ.9వేల కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారన్నారు. మహిళలకు, వికలాంగులకు, వృద్ధులకు, పేద ప్రజలకు వివధ రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకై క రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గౌతమ్ గౌడ్, కాలనీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రావు, కాలనీ వాసులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో కాషాయజెండా ఎగురవేస్తాం



చందానగర్ అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో పాదయాత్ర చేస్తున్న రవికుమార్‌యాదవ్ తదితరులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ ధీమా

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లిలో కాషాయజెండా ఎగురవేస్తామని బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గడపగడపకూ బీజేపీ రవన్న ప్రజా యాత్రలో భాగంగా చందానగర్ అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, శ్రీరామ్‌నగర్‌కాలనీలోపాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను మట్టికరిపించి భారీ మెజార్టీతో గెలుపు సాధించి బీజేపీ సత్తాను చాటుతా మని ఆయన స్పష్టం చేశారు. ఈ సారి బీజేపీకి అవకాశం కల్పించాలని ప్రజలంతా ఇప్పటికే నిర్ణయించారని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం కోసం పాదయాత్రలు చేపట్టామని, ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే భారీ మెజార్టీతో బీజేపీ విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, నాయకులు సిందూరెడ్డి, రామిరెడ్డి, అర్జున్, విజయ్, ప్రభాకర్, గౌస్, చందర్‌యాదవ్, పృథ్వీగౌడ్ పాల్గొన్నారు.

అలరించిన రామాచారి సంకీర్తనలు



మాదాపూర్: గాయకుడు రామాచారి సంకీర్తనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న నాదబ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం ప్రముఖ నేపథ్య గాయకుడు కొమండూరి రామాచారి శిష్య బృందం అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. కంటిమి ఇన్నాళ్లు, నిత్యులు ముక్తులు, వినవమ్మ యశోధ, గోవిందాశ్రిత తదితర కీర్తనలను ఆలపించారు. వీరికి సంగీత సహకారాన్ని తబలాపై నోవా, కీబోర్డుపై రాజు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ శోభరాజు, వైద్య నిపుణులు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ ఆత్మహత్య

గచ్చిబౌలి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ ఎన్‌ఆర్‌ఐ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మహేష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు పట్టణానికి చెందిన జక్కిరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి(43) నాలెడ్జ్ సిటీలోని మైహోం భూజలోని బి బ్లాక్ 1401 ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నాడు. 20 ఏళ్ల క్రితం ఆస్ట్రేలియా వెళ్లిన ఆయన నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌కు తిరిగి వచ్చాడు. భార్య విడాకులు ఇవ్వడంతో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకొని ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం విష్ణువర్ధన్ రెడ్డి ఇంటికి వచ్చిన అతడి స్నేహితుడు మెయిన్ డోర్ తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా విష్ణువర్ధన్ రెడ్డి బెడ్ రూమ్‌లో బెడ్‌షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దసెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందించాడు. వారి సమాచారం సంఘటనా స్థలానికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా ఆస్పత్రికి తరిలించారు. గుంటూరులో ఉంటున్న అతడి తల్లిదండ్రులకు సమాచారం అందించామని, వారు వస్తేనే పూర్తి వివరాలు వెల్లడవుతాయన్నారు. వ్యాపారంలో అప్పులు చేయడం, రుణదాతల ఒత్తిడి కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని స్థానికులు పేన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి, కథక్ నృత్య ప్రదర్శన





మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న శారీమేళా, దసరా, బతుకమ్మ ఉత్సవాల్లో సందర్శకులు సందడి చేస్తున్నారు. చేనేత కళాకారులు రూపొందించిన చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి, కథక్ ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. రేణుక ప్రభాకర్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనలో దక్ష యజ్ఞం, అష్టాదశ శక్తిపీఠాలు, నృత్యరూపకం అలరించాయి. అర్చనమిశ్ర , సోనాల్ భాస్కర్ శిష్యబృందం కథక్ నృత్యప్రదర్శనలో గణేశ వందన, గురువందన, నృత్యసంగీత్, తరణ, దేవీస్తుతి అంశాలను కళాకారులు అర్చన మిశ్ర, శ్రేయసుమన్, లక్షిత, దేవంశీ, నటాషా, స్వాతి, పద్మరని, మిరయా తదితరులు ప్రదర్శించారు.